ఈవీఎంల ర్యాండమైజేషన్

విశాలాంధ్ర - కాకినాడ : సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో భాగంగా ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి తొలి ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను ముందుగా కలెక్టర్ జె. నివాస్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అనంతరం రాండ్ మైజేషన్‌లో ఆయా నియోజకవర్గాలకు అలాట్ అయిన ఈవీఎంలు, వివి ప్యాడ్‌లను కలెక్టర్ ఆయా నియోజకవర్గాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె. నివాస్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వచ్చే వారం నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యర్థుల నామినేషన్ల దాఖలులో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల పై తగు అవగాహన పెంపొందించు కోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, జిల్లా ఆడిట్ అధికారి, ఎక్స్పెండచర్ నోడల్ అధికారి వై. సురేష్, తదితరులు పాల్గొన్నారు

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గ పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల పరిధిలోని పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం వద్ద ఆర్వో మీడియాతో మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధుల గురించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మొదటి రోజు 240 మందికి శిక్షణ ఇవ్వగా, రెండోవ రోజు 232 మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని వికలాంగులు ఇంటి వద్దే ఓటింగ్ వేసే విధానాన్ని ఈ ఎన్నికల్లో కొత్తగా ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. వృద్ధులు, వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్వో సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జగ్గంపేట తహసీల్దార్ బాషా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

విశాలాంధ్ర - కిర్లంపూడి/జగ్గంపేట : జగ్గంపేట నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. కిర్లంపూడి మండలం గొనేడ, శృంగారాయునిపాలెం, కృష్ణవరం గ్రామాల్లో శుక్రవారం వాలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహంకు, ఎంపి అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మద్దతు ప్రకటించారు. అలాగే జగ్గంపేట మండలం కాండ్రేగులలో 14 మంది వలంటీర్లకు 8 మంది రాజీనామాలు చేశారు. జె కొత్తూరు గ్రామంలో వలంటీర్లు గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మడగల పెద్దకాపుల అధ్వర్యంలో తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ఐ శ్రీనివాస్ అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తోట నరసింహంను, కాకినాడ ఎంపి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించేందుకు మేము సిద్ధమని అన్నారు.

ఆర్ఆర్ హాస్పిటల్ కొత్త భవనం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర- తాళ్ళపూడి : మండల కేంద్రమైన తాళ్ళపూడిలో అంధ్రాబ్యాంకు ఎదుట అభిమానులు, బంధు మిత్రుల కరతాళ ధ్వనులు మధ్య ఆర్ ఆర్ ఆస్పత్రి కొత్త భవనం లో ప్రారంభించారు. 24 గంటల పాటు అందుబాటులో వుండేలా మంచి వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు చూరగొనాలని పలువురు పెద్దలు, నాయకులు, అభిమానులు ఆర్ ఆర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రెడ్డి దంపతులకు పూలబొకేలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య ప్రముఖ పారిశ్రామికవేత్త సింహాద్రి జనార్దన్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయక ప్రముఖులు జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, కంటమని రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు, డాక్టర్. ఇ. మంగన్న మండలంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

హోంమంత్రి ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర-నల్లజర్ల : పోతవరం గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి, హోంమంత్రి తానేటి వనిత ఇంటింట ప్రచారం నిర్వహించారు. జగన్మోహన్ రెడ్డి చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ మరల వైసీపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించవలసిందిగా ప్రజలను కోరారు. మరలా జగన్ మోహన్ రెడ్డి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని జగనన్న పాలనను మరలా చూద్దామని ప్రజానీకానికి తెలియజేస్తూ అందరూ ఫ్యాన్ గుర్తు మీద ఓటు వేసి గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. నల్లజర్ల మండల సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, బంక అప్పారావు, పోతవరం గ్రామ సర్పంచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ, గగ్గర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచుగా వస్తున్నాను దీవించండి -వంగా గీత

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : పిఠాపురం నియోజకవర్గానికి ఆడపడుచుగా వస్తున్నాను ప్రజలు దీవించాలని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగా గీత అన్నారు. శుక్రవారం కొండేవరం గ్రామంలో ఓటర్లను అభ్యర్థించడానికి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో ఎమ్మెల్యేగా నియోజక వర్గంలో పనిచేసిన అనుభవం నాకు ఉందని, మళ్లీ నన్ను దీవించి అసెంబ్లీకి పంపితే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాలే కాకుండా, పేదలకు మరిన్ని పథకాలు ఇచ్చేందుకు జగన్ కృషి చేస్తున్నారని గీత అన్నారు. ప్రత్యర్థులు ఎంతమంది వచ్చినా పిఠాపురంలో వైసీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ గీత వెంట పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం, కాకినాడ వైసిపి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, సీనియర్ వైసీపీ నాయకుడు జ్యోతుల చక్ర అబ్బాయి, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో వైసీపీ నాయకులు, జెడ్పీటీసీ వై.సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ నెడ్క్యాప్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి రాఘవ సొసైటీ అధ్యక్షులు నక్క వీరభద్రరావు వైస్ ఎంపీపీ భీమన్న, గ్రామ వైసిపి ప్రెసిడెంట్ ఎం. సత్తిబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం గొర్రిపూడి గ్రామంలో సర్పంచ్ రమాదేవి అధ్యక్షతన చీకాల సుబ్బారావు చీకల అప్పలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో నవరత్నాలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మనసు గెలిచిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని కన్నబాబు తెలిపారు. మంచి జరిగితేనే ఓటేయండి అని చెప్పిన దమ్మున్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కన్నబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోన శ్రీను, ముద్రగడ నానాజీ, తుమ్మలపల్లి చంద్ర నగేష్, మద్దూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ గంగ భవాని భాస్కర్, నక్క సత్తిబాబు, తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

విశాలాంధ్ర - ముమ్మిడివరం : త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణంలో అత్యంత పారదర్శకంగా సజావుగా నిర్వహిం చేందుకు అని ప్రక్రియలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షుశుక్లా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎయిమ్స్ కళాశాల మూడవ అంతస్తులో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పోలింగ్ సిబ్బందిని అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయింపు రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అంశాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను రాండమైజేషన్ ద్వారా ఏడు నియోజకవర్గాలకు కేటాయిస్తూ వాటిపై స్టిక్కర్లు అతికించి ఆ యొక్క వివరాలను స్కానింగ్ చేసే అప్లోడ్ చేయడం జరుగుతోందని, ప్రస్తుతం కేటాయించిన ఈవీఎంలు జాబితా అదేవిధంగా పోలింగ్ సిబ్బంది జాబితాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించడం జరుగుతుందని ఆ ప్రకారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఆయా అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు అప్పగించడం జరుగుతుందన్నారు. సిబ్బంది కూడా రాండమై జేషన్ ప్రక్రియ వివరాలు ప్రకారం కేటా యించబడిన అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి వైద్యనాథ శర్మ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్ మధుసూదన్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యా సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం డిఈ సుబ్బరాజు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో నేనే హీరో -ముద్రగడ

విశాలాంధ్ర - జగ్గంపేట/కిర్లంపూడి : సినిమాల్లో పవన్ కళ్యాణ్ హీరో అంతేకానీ రాజకీయాల్లో హీరో కాదని, రాజకీయాల్లో నేను హీరోని అని మాజీ మంత్రి, వైసిపి నేత ముద్రగడ పద్మనాభం పేర్కొన్నారు. పిఠాపురం నియోజకవర్గ వెలమ సంఘం నాయకులు శుక్రవారం కిర్లంపూడి ముద్రగడ నివాసానికి చేరుకుని ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో ముద్రగడ మాట్లాడుతూ పవన్ రాజకీయాల్లో హీరోగా నటించాలని చూస్తే ప్రజలు హర్షించరన్నారు. రాష్ట్రంలో వైసీపీ విజయం సాధిస్తుందని మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను ప్రజలు గెలిపిస్తారన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో వంగా గీతను గెలిపించాలన్నారు. కాపు ఉద్యమంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. పవన్ హైదారాబాద్, విజయవాడలో ఉన్న ఆస్తులను అమ్మేసి పిఠాపురంలో నివాసం ఉండాలన్నారు. సినిమాలో నటించడానికి ఎమ్మెల్యే పదవి అవసరం లేదన్నారు.

తన ఇల్లు తగులబెట్టిన వ్యక్తికి చంద్రబాబు టికెట్ ఇచ్చారు : మంత్రి విశ్వరూప్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో పట్టపగలు తన ఇల్లు తగులబెట్టిన వ్యక్తికి తెలుగుదేశం పార్టీ టికెట్ ఇచ్చి పోటీకి నిలబెట్టిన చంద్రబాబు నాయుడు సిగ్గులేకుండా తనపై ఆరోపణలు చేసారని రాష్ట్ర రవాణా శాఖామంత్రి వైకాపా అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ విమర్శించారు. శుక్రవారం ఆయన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చంద్రబాబు పై విశ్వరూప్ నిప్పులు చెరిగారు. టిడిపి అభ్యర్థి అయితాబత్తుల అనందరావు తన అవినీతి మరకలు నాపైన పూసే ప్రయత్నం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చౌకబారు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నా డన్నారు. తాను ఒక్క అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ఎన్నికల్లో పోటీ నుండి తప్పుకుంటానని విశ్వరూప్ సవాల్ విసిరారు. 15 ఏళ్ల రాకీయ జీవితంలో ఒక్క రూపాయి ఎవరినుంచి తీసుకోలేదని దమ్ముంటే నిరూపించాలని విశ్వరూప్ సవాల్ చేశారు. చంద్రబాబు నాయుడు అమలాపురం సభలో తనపై చేసిన ఆరోపణలు నిరాధారమన్నారు. అనందరావు ఛాలెంజ్ విసురు తున్నా నిరూపించు అని విశ్వరూప్ అన్నారు.

రాజ్యాధికారంతోనే బహుజనుల సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: రాష్ట్రంలో బహుజనులు అధికారం లోకి వస్తేనే బహుజనుల సమస్యలు పరిష్కారమవుతాయని బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరంజ్యోతి స్పష్టం చేసారు. ఇప్పటి వరకు రెండు కులాలు, రెండు కుటుంబ పార్టీలు ఈ రాష్ట్రాన్ని పాలిస్తూ వచ్చాయని ఆయన గుర్తుచేస్తూ, ఈ విధానం మారాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఆల్కాట్ గార్డెన్స్ గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల నాయకుల, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ముఖ్య సమావేశం జరిగింది. జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మీడియాతో మాట్లాడుతూ ఒక బిసి గానీ, ఒక ఎస్సీ గానీ ముఖ్యమంత్రి కావాలంటే అది బీఎస్పీ వల్లే సాధ్యమన్నారు. మొత్తం 175అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్నామని పరంజ్యోతి పేర్కొంటూ అధికారం తమకు అప్పగిస్తే బహుజనుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్లు పూర్ణచంద్రరావు, నిడదవోలు అభ్యర్థి గుమ్మాపు చిత్రసేను, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పి గణేశ్వరరావు, పి గన్నవరం అభ్యర్థి కె. సత్యం, అమలాపురం అభ్యర్థి యాళ్ల దొరబాబు, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి కే నరసింహమూర్తి, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు ఎం సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా అధ్యక్షులు ఎం మోషే, రాజమండ్రి రూరల్ అభ్యర్థి కొండపల్లి సూరిబాబు, నాయకులు బత్తుల లక్ష్మణరావు, ఐ రాంబాబు, భవాని, జిప్రసాద్, టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యనిషేధం పేరుతో లక్ష కోట్లు దోచుకున్నారు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మద్యనిషేధం పేరుతో జగన్ లక్ష కోట్లు దోచుకున్నారని కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. మండల కేంద్రంలో అంకంపాలెం గ్రామంలోని ప్రజాగళం ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మద్యనిషేధం అని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పి ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. జగన్ సోదరుడు వైఎస్ అనిల్ రెడ్డి మద్యం వ్యాపారంలో ఆరితేరి ఉన్నారని ఇటీవల వింటున్న లిక్కర్ స్కామ్ కంటే పెద్ద స్కామ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని అన్నారు. జె బ్రాండ్ల కల్తీ మద్యం అమ్మకాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యంలో దోచుకున్న డబ్బును ఎన్నికలలో పంచేందుకు ఇటీవల కంటైనర్ ద్వారా తరలించారని సత్యానందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కుదప కృష్ణమూర్తి, కరుటూరి నరసింహారావు, మాజీ వాడపల్లి దేవస్థానం చైర్మన్, కాయల జగన్నాథం, ముత్తాబత్తుల రాజు గ్రామ సర్పంచ్, కప్పల సునీల్ మొదలగువారు పాల్గొన్నారు.

14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి

విశాలాంధ్ర - కాకినాడ : ఏప్రియల్ 14వ తేదీన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ జె. నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీన ఉదయం 10.00 గంటలకు కాకినాడ ఇంద్రపాలెం కూడలి వద్ద గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్టు జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. నివాస్ కోరారు.

పంచాయతీ సమస్యలపై స్పందించిన చంద్రబాబు

విశాలాంధ్ర - అంబాజీపేట : వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళంలో ప్రస్తావించడం హర్షణీయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. ప్రజాగళం ఎన్నికల కార్యక్రమానికి అంబాజీపేట విచ్చేసిన నారా చంద్రబాబునాయుడుకు పంచాయతీల సమస్యలను వివరించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ బకాయిలు ఉన్న కారణంతో పంచాయతీ విద్యుత్ సరఫరాను నిలిపివేశారని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామపంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను డంపింగ్ చేసేందుకు ఇబ్బందిగా మారిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తను డంపింగ్ చేసేందుకు స్థలాలను మంజూరు చేయాలని కోరారు. శాంత కుమారితో పాటు అమలాపురం పార్లమెంటరీ కూటమి అభ్యర్థి గంట హరీష్ మాధూర్, టిడిపి పి గన్నవరం నియోజకవర్గ కో కన్వీనర్ నామన రాంబాబు, సర్పంచ్‌ల సంఘం నాయకుల తదితరులున్నారు.

పిఠాపురంలో ఆటో యూనియన్ పేరుతో రౌడీయిజం

విశాలాంధ్ర విలేకరిపై విచక్షణారహితంగా దాడి

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురంలో ఆటో యూనియన్ పేరుతో రౌడీయిజం చేయడం, విశాలాంధ్ర విలేఖరిపై విచక్షణారహితంగా దాడి చేయడం సంచలనం కలిగించింది. పిఠాపురం శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానం గుడి వద్ద శ్రీ పాద వల్లభ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ రిజిస్టర్ నెంబర్ 388/2017 సభ్యులు చుట్టుపక్కల నుండి ఏ ఆటోలు గాని కార్లు గాని వచ్చినా అక్కడ యూనియన్ సభ్యులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. గాలి గంగాలమ్మ గుడి వీధిలో నివసిస్తున్న కిరణ్ అనే జర్నలిస్టుపై శ్రీపాద శ్రీ వల్లభ సంస్థానం వద్ద ఆటో యూనియన్ సభ్యులు ఇంటికి వచ్చి దౌర్జన్యం చేశారు. కిరణ్ ఇంట్లో మహారాష్ట్ర వారు నివసిస్తూ ఉండటంతో వారు బయట ఆటోను పెట్టడంతో సభ్యులు అక్కడికి వెళ్లి ఇంటిపై రాళ్లు విసిరి, కిరణ్ పై దౌర్జన్యం చేశారు. ఇంట్లో ఆడవారి పై కూడా దురుసుగా ప్రవర్తించారు. బయట నుండి ఈ ప్రాంతానికి ఏ ఆటో వచ్చినా సహించేది లేదు అనడంతో అక్కడ పెద్దలు వారిని సాయంత్రం మాట్లాడదాం ఇక్కడ నుండి వెళ్ళండి అనడంతో వారు వెళ్లిపోయారని, మీడియాకు తెలిపారు. కొద్దిసేపు గడిచాక కిరణ్ బయటకు తన సొంత పనిపై వెళుతుంటే శ్రీపాద శ్రీ వల్లభ స్వామి గుడి వద్ద దవులూరి గంగబాబు తనపై దౌర్జన్యం చేసి రక్తం వచ్చేలా కొట్టడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళిన వెంటనే తనకు కుట్లువేసి, పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇచ్చారని మీడియాకు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యాధర్ ప్రతిభ

విశాలాంధ్ర - ఆలమూరు : ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన అద్దరి శ్రీనివాస్ తనయుడు విద్యాధర్ అత్యుత్తమ ప్రతిభ చూపారు. గతంలో జేఈఈ మెయిన్స్ నందు 99.106 శాతం మార్కులతో ప్రతిభ కనబరచగా శుక్రవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూప్ ద్వారా 985 మార్కులు సాధించారు. ఈ మేరకు విద్యాధర్ సాధిస్తున్న విజయాలకు తల్లిదండ్రులు శ్రీనివాస్ జ్యోతి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

విశాలాంధ్ర- పెరవలి : గురువారం రాత్రి సుమారు 11 గం సమయం లో నిడదవోలు నుండి నరసాపురం వెళ్ళు రోడ్డులో కానూరు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన. చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెరవలి మండలం, అన్నవరపాడు గ్రామానికి చెందిన వసంతాడ మధు(20) కలవచర్లలో తన దగ్గర బంధువైన ముప్పిడి నాగ చరణ్‌తో కలసి తన మోటార్ సైకిల్‌పై కలవచర్ల నుండి అన్నవరపాడు వెళుతుండగా కానూరు సమీపంలో వారికి ముందుగా వెళుతున్న లారీని డ్రైవరు నిర్లక్ష్యంగా నడుపుతూ సడన్ బ్రేక్స్ వేయడంతో సదరు వసంతాడ మధు తన మోటార్ సైకిల్‌కు లారీ వెనుక భాగం తగలడంతో మధు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ముప్పిడి నాగ చరణ్‌కు గాయాలైనట్టు తెలిపారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవరు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పెరవలి ఎస్.ఐ మూర్తి తెలిపారు.

మహారాజశ్రీ అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
ఎ.ఎస్.47/2018

బిట్వీన్
మొంద్రేటి విజయ - పిటీషనర్
మరియు
మొంద్రేటి అరునరామ్‌కుమార్ @ రమేష్ - రెస్పాండెంట్లు

టు
5వ రెస్పాండెంటు
మొంద్రేటి సత్యశేషు నారాయణస్వామి @ సతీష్, తండ్రి లేటు. వెంకటస్వామి,
డోర్ నెం. 2-92, భూపతివారిపేట విలేజ్, నరసాపురం మండలం, నరసాపురం జిల్లా.

పై నెంబరు అప్పీలు దావాలో 5వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించుచున్నాను మీరు బుద్ధి పూర్వకముగా తీసుకొనకుండా నిలువరించు చున్నందున, శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటీసు అమలు చేయమని ఆర్డరు వేసినందున ఈ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున ది. **3-5-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. ఆ రోజున మీరు స్వయంగా గాని, లేదా మీ ప్లీడరుగారి ద్వారాగాని పై కోర్టువారి ఎదుట హాజరు అయి, మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా : 3-5-2024

డి.వి.వి.ఎస్.ఎస్.ఎస్.హెచ్. భుజంగరావు, అడ్వకేట్, అమలాపురం

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ తన ఎన్నికల రాజకీయ ప్రచారాన్ని శుక్రవారం కవలగొయ్యి గ్రామంలో రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మతోన్మాద బిజెపి రాజకీయ చదరంగంలో వైసిపి, టిడిపి, జనసేనలు పావులేనని వాటికి తగిన గుణపాఠం చెప్పాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నికల బాండ్ల రూపంలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిందని ఈ విషయాలు ప్రజలకు తెలియకుండా ఉండే దానికోసం ప్రతిపక్ష నాయకులను ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నిరంకుశత్వంతో అరెస్టు చేస్తుందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ వనరులన్నింటిని కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మివేస్తున్నారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి విభజన హామీ చట్టాలు ప్రకారం రావలసిన నిధులను ఒక పైసా కూడా ఇవ్వలేదని, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ,రాజధాని నిర్మాణం, కడప స్టీల్ ఫ్యాక్టరీ,కేంద్ర విద్యా సంస్థలు విశాఖ రైల్వే జోన్ ఇవేవీ కూడా అమలు చేయకుండా అన్యాయం చేసిందని, మధు అన్నారు . విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నదని అన్నారు. ఢిల్లీ మహానగరంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేస్తుంటే నిరంకుశంగా అణచివేయడం కోసం ప్రయత్నం చేసిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బిజెపిని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు, కార్యవర్గ సభ్యులు చింతలపూడి సునీల్ , కాంగ్రెస్ సిటీ అభ్యర్థి బోడ వెంకట్ కె శ్రీనివాస్, నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ ఆఫీసర్ వారి సూచనల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికలలో వినియోగించే ఈవీఎంల మొదటి రాండమైజేషన్‌ను షెడ్యూలు మేరకు శుక్రవారం చేపట్టినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. మాధవీలత తెలియ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం లోని జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్ హౌస్ గోడౌన్‌లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియని స్వయంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ - నలబాటి రమేష్ (శ్యామ్) , టిడిపి - సిహెచ్. శ్రీనివాసరావు, సలాది ఆనంద్, బిజెపి - జి. వెంకట రావు, వైయస్ఆర్ సీపీ - వై వి ఎస్ శ్యామల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని నియోజక వర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఏప్రియల్ 12 , 13 తేదీల్లో రాజమహేంద్రవరంలోని జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్ హౌస్ గోడౌన్‌లో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. ఆప్రక్రియలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తొలుత రాండమైజేషన్‌కి సంబంధించి అనుసరిస్తున్న విధానం పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమగ్ర సమాచారాన్ని అందచేశారు. కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ ఆర్వో జె సి - ఎన్. తేజ్ భరత్, రాజమండ్రి అర్బన్ ఆర్వో, మునిసిపల్ కమిషనర్ కే. దినేష్ కుమార్, కొవ్వూరు ఆర్వో, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డిఆర్వో జీ. నరసింహులు, రాజానగరం ఆర్వో/ ఆర్డీఓ ఏ. చైత్ర వర్షిణి, గోపాలపురం ఆర్వో - కె ఎల్ శివజ్యోతి, అనపర్తి ఆర్వో ఎమ్. మాధురీ, నిడదవోలు ఆర్వో ఆర్.వి.రమణా నాయక్, రాజమండ్రీ పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి - ఎస్.డి.సి. ఆర్.కృష్ణా నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం. భాను ప్రకాష్, పి. సువర్ణ, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు ఆదిరెడ్డి పరిష్కారం



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : అభివృద్ధి అంటూ అవగాహన రాహిత్యంతో రాజమండ్రి మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కారణంగా పలు సమస్యలు ఉత్పన్నమైన సంగతి తెలిసిందే. ఏదైనా ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఫైర్ ఇంజన్, అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలు వచ్చేందుకు వీలు లేకుండా ఈ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారని ప్రతి పక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా నగర పాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సెంట్రల్ లైటింగ్ వల్ల స్థానిక వ్యాపారులు కూడా పలు సమస్యలు ఎదుర్కొంటు న్నారని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఆ నేపథ్యంలో కమిషనర్ సెంట్రల్ లైటింగ్ను తీసివేశారు. మెయిన్ రోడ్డుకు మధ్యలో వివిధ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల అసలే ఇరుకుగా ఉన్న మెయిన్ రోడ్డు ఇంకా ఇరుకుమయంగా మారి నడిచేందుకు కూడా వివిధ పనులు నిమిత్తం మెయిన్ రోడ్డుకు వచ్చిన ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల రోడ్డు మధ్యలో వాహనాలను పార్కింగ్ చేయకుండా చూడాలని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు నగర పాలక సంస్థ కమిషనర్, ట్రాఫిక్ డీఎస్పీని లిఖిత పూర్వకంగా కోరారు.

ఎన్నికల కోడ్‌తో.. కోటా మేరకే అమ్మకాలు

కోటా పూర్తికాగానే మద్యం షాపుల మూసివేత

విశాలాంధ్ర -కొవ్వూరు : మద్యం దుకాణాలు మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. మధ్యాహ్నం దాటితే షాపుల్లో మద్యం దొరుకుతుందన్న గ్యారంటీ లేకుండా పోయింది. ఈరోజు కోటా అయిపోయిందంటూ సిబ్బంది షాపులు మూసి వెళ్లిపోతున్నారు. ఉదయం షాపులు తెరిచిన వెంటనే వివిధ పార్టీల కార్యకర్తలు షాపుల వద్ద పెద్దఎత్తున బారులు తీరడమే దీనికి కారణం. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక మద్యం అమ్మకాలపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం గతేడాది ఈ సమయంలో ఎంత మద్యం విక్రయించారో, ఇప్పుడు కూడా అంతే అమ్మాలి. దీనిని రోజువారీ ప్రాతిపదికగా అమలు చేస్తున్నారు. అంటే గతేడాది ఈ తేదీన ఎంత అమ్మారో, ఈ ఏడాది ఆ తేదీన అంతకుమించి అమ్మకూడదు. కానీ ఎన్నికలు సమీపిస్తుండటంతో మద్యం వినియోగం బాగా పెరిగింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న పార్టీల శ్రేణులకు మద్యం పంపిణీ తప్పనిసరి. దీంతో నాయకులు ఉద యాన్నే కార్యకర్తలను షాపులకు పంపి మద్యం తెప్పించుకుంటున్నారు. దీంతో మందుబాబులు తలలు పట్టుకుంటున్నారు. మార్చి 13న పోలింగ్ అయ్యేవరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురైందని మందుబాబులు వాపోతున్నారు.

కాపులను నట్టేట ముంచిన ముద్రగడ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : తన స్వార్ధ రాజకీయాల కోసం కాపులను ఉద్యమాల పేరుతో ఉసిగొల్పి నట్టేట ముంచింది ముద్రగడ కాదా అని గురువారం తాడేపల్లిగూడెం వచ్చిన ముద్రగడ ను కాపు నాయకులు పత్రికా సమావేశం ద్వారా నిలదీశారు. జననేత నేత పవన్ కళ్యాణ్ పై కాపు ద్రోహి గా ముద్రవేసి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని తాడేపల్లిగూడెం కాపు నాయకులు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం లోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాపు నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు ఉద్యమం పేరుతో కాపులకు ఏదో చేస్తారని నమ్మకంతో కాపులంతా ముద్రగడ వైపు వెళ్తే వారికి మిగిలింది కేసులు తప్ప ఏమీ లేవన్నారు.కాపులపై ప్రేమ, గౌరవం ఉంటే భేషరతుగా పవన్ కళ్యాణ్ కు సపోర్ట్ చేయాల్సింది పోయి జగన్ వేసే రాజకీయ ముష్టి కోసం పాకులాడారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు అడబాల నారాయణమూర్తి, గుండమోగల సురేష్,రామిశెట్టి సురేష్, యర్లపల్లి శ్రీరామ్,అంబటి కృష్ణ,గట్టు గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకునికి నివాళులు

విశాలాంధ్ర-లింగపాలెం: టీ సి హెచ్ ఆర్ పాలెం లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దళిత నాయకుడు లక్క పాము సుందరం కుటుంబాన్ని లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగ సందీప్ పరామర్శించారు.

గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెద్దగా విద్యాభ్యాసం లేకపోయినప్పటికీ దళితుల సమస్యలపై పోరాడుతూ వారి అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈయన సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈయన కుమారులలో ఒకరు ఆర్.సి.యం గురువుగా పనిచేస్తున్నారు. ఈయన ప్రస్తుతం యూరప్‌లో రోమన్ క్యాథలిక్ గురువుగా పనిచేస్తున్నారు. మృతి చెందిన సుందరం చిత్రపటానికి లిడ్ క్యాప్ డైరెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నంది పాము యేసు రత్నం, ముళ్ళపూడి సుమన్, పింగుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత,, క్రమశిక్షణ గల నాయకుడు రామకృష్ణ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సమయం రామకృష్ణ యూనియన్ పట్ల పూర్తి నిబద్ధత క్రమశిక్షణ గల నాయకులని, బ్యాంకులో కూడా అదే క్రమశిక్షణతో పనిచేసి ఖాతాదారుల మన్ననలు పొందారని బ్యాంకు యూనియన్ నాయకులు పేర్కొంటూ వారికి జోహార్లు తెలిపారు . బుధవారం రాత్రి మరణించిన సమయం రామకృష్ణ మరణానికి సంతాపం తెలుపుతూ తాడేపల్లిగూడెంలో యూనియన్ సీనియర్ నాయకులు సిద్దాబత్తుల సూర్యనారాయణ, కోఆర్డినేషన్ కమిటీ సీనియర్ నాయకులు ఎస్ ఎస్ ప్రసాద్, ఏపీ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, ఆంధ్రాబ్యాంకు యూనియన్ నాయకులు పాలూరి సత్యనారాయణ, వి.సురేష్ కుమార్, ఎం. రత్నప్రసాద్, జె. రత్నరాజు యూనియన్ సహాయ రీజనల్ కార్యదర్శి బి. దివ్య రజని, లింగంపల్లి గాంధీ, బ్యాంకు అఫ్ ఇండియా యూనియన్ సహాయ కార్యదర్శి బి.ఏడుకొండలు సంతాప సందేశంలో పేర్కొన్నారు. రామకృష్ణ పనివిధానం ఆదర్శం, ఆచరణీయమని వారు తెలిపారు.తాడేపల్లిగూడెం బ్యాంకు ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ వ్యవస్థాపకులలో రామకృష్ణ ఒకరని, 1968-69 ప్రాంతంలో- నాటి నాయకులతో కలిసి బ్యాంకుల జాతీయకరణ పోరాటాలలో పాల్గొన్నారని వారు గుర్తు చేశారు.యూనియన్ కార్యక్రమాలలో కొత్త తరానికి ఆయన మంచి మార్గదర్శకత్వం చేసేవారని పేర్కొన్నారు. అధికారులు,సిబ్బంది అందరికీ తలలో నాలుకలా ఉండేవారని వారు పేర్కొన్నారు. రిటైర్ అయిన తర్వాత కూడా ఆక్టివ్ గ వుండే వారని, వారి మృతి ఆంధ్ర బ్యాంకు (యూనియన్ బ్యాంకు) యూనియన్ కు, కోఆర్డినేషన్ కమిటీ కి తీరని లోటని వారికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఐఎన్‌టిఎస్ఓ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులకు బంగారు పతకాలు

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక శాంతినగర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన ఐ ఎన్ టి ఎస్ ఓ (సెకండ్ లెవెల్) ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కన బరిచి, తమ సత్తా చాటారని , లాప్టాప్ , ట్యాబ్ లతో పాటు 169 మంది విద్యార్థులు బంగారు పతకాలను, ప్రశంసా పత్రాలను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా గ్రాండ్ బహుమతి (లాప్టాప్) సాధించిన చి. కంకర్ల డీన్ పాల్ తో సహా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలను శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుంకర పార్థసారథి, రీజనల్ ఇంఛార్జి సిహెచ్. ఉదయభాస్కర్, జోనల్ అకడమిక్ డీన్ జె. సంజీవ్ కుమార్, ప్రైమరీ ఇంచార్జ్ నరీనా, ఎగ్జామ్ ఇన్చార్జ్ సి.హెచ్. కమలావతి, ఎం.జయశ్రీ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

రష్మిక మందన్నతో "సువర్ణ అవకాశం" పోటీ గ్రాండ్ ఫైనల్‌ను నిర్వహించిన టాటా టీ చక్ర గోల్డ్

విశాలాంధ్ర-ఏలూరు: దక్షిణ భారతదేశంలో రెండవ అతిపెద్ద టీ బ్రాండ్, టాటా టీ చక్ర గోల్డ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో గత 90 రోజులుగా ఎంతో ఆసక్తిగా నిర్వహిస్తున్న సువర్ణ అవకాశం పోటీని ఈ రోజు బ్రాండ్ అంబాసిడర్ రష్మిక మందన్న సమక్షంలో ముగించింది. "సువర్ణ అవకాశం" కార్యక్రమం ఇంగ్లీషులో "గోల్డెన్ ఆపర్చునిటీ" గా అనువదించే ఈ పోటీ కేవలం టీ వేడుక మాత్రమే కాదుబీ ఇది అద్వితీయమైన క్షణాలు, ఆహ్లాదకరమైన రుచులు మరియు ఊహించని రివార్డ్‌ల యొక్క సంపూర్ణ సమ్మేళనంగా ఆనందాన్ని అందిస్తుందని టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ ప్యాకేజ్డ్ బెవరేజెస్, ఇండియా, సౌత్ ఏషియా, టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ అధ్యక్షులు పునీత్ దాస్ తెలిపారు. వినియోగదారులు టాటా టీ చక్ర గోల్డ్ యొక్క ఏదైనా ఆఫర్ ప్యాక్‌ని కొనుగోలు చేయడం ద్వారా మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ప్యాక్‌లో ఉన్న ప్రత్యేకమైన కోడ్‌ను చెప్పటం లేదా ప్యాక్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చు, ఇది సౌకర్యవంతమైన అనుభవాన్ని అందిస్తుందన్నారు. సువర్ణ అవకాశం పోటీ యొక్క ముగింపు లో భాగంగా 25 మంది ఉత్సాహభరితమైన విజేతలను ఒకచోట చేర్చిందని, వారు అతిథులతో కలిసి, చక్కటి నటన, అందం గురించి తరచుగా గుర్తుచేసుకునే నటిని కలుసుకున్నారన్నారు. టాటా టీ చక్ర గోల్డ్ నిర్వహించిన ఈ కార్యక్రమం, విజేతలకు రష్మిక మందన్నను వ్యక్తిగతంగా కలుసుకునే చిరస్మరణీయమైన అవకాశాన్ని అందించిందని, రష్మికతో నిర్వహించిన ఆకర్షణీయ మైన మీట్ గ్రీట్ సెషన్‌తో పాటు, టాటా టీ చక్ర గోల్డ్ 500 మంది అదృష్టవంతులైన విజేతలకు అద్భుతమైన బంగారు నాణెములను కూడా అందించిందని చెప్పారు.

వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర-భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ అభివృద్ధి చూసి వైకాపాలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణానికి చెందిన 13 వార్డులకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు, మాజీ టీడీపీ కౌన్సిలర్ సీసలి రాజేశ్వరిలు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో నాడు నేడు కూడా అభివృద్ధి తన హయాంలోనే జరిగిందని స్పష్టం చేశారు. తన హయాంలోనే 82 ఎకరాల భూమిని సేకరించినట్టు తెలిపారు. ఆ భూమిలోనే టిడ్కో గృహాలను నిర్మించినట్టు పేర్కొన్నారు. లబ్దిదారులకు ఈ గృహాలను అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో డి సి ఎం ఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, నందమూరి ఆంజనేయులు, పాలవెల్లి మంగ, అల్లూరి నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ, వేండ్ర విజయదుర్గ, చినమిల్లి వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులు పరసా శ్రీనుకు ప్రాధాన్యత ఏది?

విశాలాంధ్ర -చాట్రాయి : బీసీ గర్జన సభలో 30 ఏళ్లుగా చిల్లిగవ్వ ఆశించకుండా తెలుగు దేశం పార్టీకి అనునిత్యం పూర్తి కాలం కార్యకర్త లా పనిచేస్తున్న బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నాయకులు పరసా శ్రీనివాసరావును వేదిక మీదకు పిలవకపోవడం చర్చనీయాం శంగా మారుతోంది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జనాభాలో అత్యధిక శాతంగా వున్న బలహీనవర్గాలలో గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రజలకు దగ్గరగా వెళ్లడం కోసం ప్రారంభించిన బీసీ గర్జన సభలో కూడా వేదిక మొత్తం ఓసీలతోనే నిండిపోయి బిసిలకు అది చేశాం ఇది చేశామని పెద్ద పెద్ద గొంతులతో ఆవేశపూరితంగా ప్రసంగాలు చేస్తున్నారు కానీ చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో బలహీన వర్గాల రజక సామాజిక తరగతికి చెందిన పరసా శ్రీనివాసరావు ఇస్త్రీ చేస్తూ కుటుంబ జీవనం సాగిస్తూ గడచిన 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో అంకిత భావంతో పని చేసే వ్యక్తిని కనీసం వేదికపైకి పిలవని పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకమైంది.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి బీసీలంతా విశేషకృషి చేయాలని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో జయహో బిసి సదస్సులు విజయవంతంగా నిర్వహించాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో బిసి నాయకులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మద్యాన్ని నిషేధిస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ తన ప్రభుత్వం ద్వారా నాసిరకం మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల మరణాలకు అనారోగ్యానికి కారణమయ్యారని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు, గూడూరి సుబ్బారావు, నాయకులు బొక్క చంద్రమోహన్, గూడూరి రామకృష్ణ, పామర్తి వెంకటరామయ్య, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

అపోలో జూనియర్ కాలేజీ విద్యార్థులకు మండల, రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అపోలో జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యధిక మార్కులతో మండల స్థాయి/ స్టేట్ ర్యాంక్ లు సాధించారని అపోలో విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎన్ . ఇందు ఎంపీసీ ద్వితీయ సంవత్సరం 984/1000 మండల ఫస్ట్, స్టేట్ ర్యాంక్ సాధించిందని,ఆర్. నివేదిత బైపిసి ద్వితీయ సంవత్సరం 949/1000 మండల ఫస్ట్, వై. ఇంద్రాణి ప్రథమ సంవత్సరం 461/470 మండల ఫస్ట్ మార్కులు సాధించారని అత్యుత్తమ మార్కులతో ఇంటర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత ను సాధించామని అపోలో విద్యా సంస్థల కరస్పాండెంట్ ఆర్.ప్రవీణ్ కుమార్, విద్యా సంస్థల చైర్ పర్సన్ ఆర్. శ్రీవిద్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్చార్జి ఆచంట రవి, ఝాన్సీ లక్ష్మి, రాధాకృష్ణ, కామాక్షి ,కృప తదితర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఐఎన్‌టిఎస్ఓలో సత్తా చూపిన జంగారెడ్డిగూడెం శ్రీచైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఐఎన్‌టిఎస్‌ఓ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారులు బుద్ధుల రాముడు, బి. రాములు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి వేరువేరు విభాగములలో బహుమతులు సాధించడం గర్వకారణమన్నారు. దీనికి చైతన్యలో జరుగు ప్రతిష్టాకత్మకమైన టెక్నో, సి బ్యాచ్ సిలబస్ కారణమని తెలిపారు. టాబ్ ప్రథమ బహుమతిగా పొందిన ఎ. గీతికను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పి.పార్థసారధి ,ఆర్ ఐ సి హెచ్ ఉదయ భాస్కర్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఏవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపు

విశాలాంధ్ర-పాలకోడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపు పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో శుక్రవారం పాలకోడేరు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ రంగం నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ క్యాంపునకు సుమారు 350 మంది రోగులు హాజరయ్యారు.వచ్చిన ప్రతి ఒక్కరిని పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలునిర్వహించి,మందులుపంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్లు, పి హెచ్ ఎన్, హెచ్ వి లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎల్ టి, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుగుదేశం జనసేన బిజెపి కూటమిల ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్, పోలవరం అభ్యర్థి చిర్రి బాలరాజుల సైకిల్, గ్లాస్, గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. మండలంలో పరింపూడి గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ మేనిఫెస్టో ద్వారా కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి, సల్లపర్తి ఝాన్సీ రాణి, కొత్త రమ, సిర్ర ఉమా,కర్రీ దేవి,గ్రామ మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెండవ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించిన ఫ్లిప్‌కార్ట్

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశంలోని స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ విశాఖపట్నంలో తన కిరాణా ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా తమ కార్యకలాపాలను విస్తరించిందని హెరిటేజ్ ఫుడ్స్ సీఈఓ శ్రీదీప్ కేశవన్, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్, ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ హెడ్, వైస్ ప్రెసిడెంట్ హరి కుమార్ తెలిపారు. స్థానిక వినియోగదారులకు మరుసటి రోజు కిరాణా డెలివరీలను అందిస్తోందన్నారు. ఫ్లిప్‌కార్ట్ తమ స్థానిక వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ఫ్రీడమ్ హెరిటేజ్ వంటి ప్రముఖ ప్రాంతీయ బ్రాండ్ల క్యూరేటెడ్ శ్రేణిని అందిస్తుందని, అలాగే డైరీ, గుడ్లు, చాక్లెట్లు, స్టేపుల్స్, క్లీనింగ్ ఎయిడ్స్ మరిన్ని వంటి వర్గాల నుండి 6,000 కంటే ఎక్కువ ఉత్పత్తులను అందిస్తుందన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ గమ్యస్థానాలలో విశాఖపట్నం ఒకటనీ ఆన్లైన్ కిరాణా సామాగ్రి కోసం ప్రధాన మార్కెట్ గా వెలుగొందుతుందన్నారు. ఇది విజయవాడ తర్వాత రాష్ట్రంలో రెండవ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్ కేంద్రం అని చెప్పారు. ఈ కొత్త ఫుల్ ఫిల్మెంట్మె సెంటర్ దాదాపు 77,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందన్నారు. అనకాపల్లి, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం విజయనగరంతో పాటు విశాఖపట్నంలో రోజుకు 8,000 ఆర్డర్లను ఇది ప్రాసెస్ చేయగలదని చెప్పారు. ఈ ప్రాంతంలోని అనేక చిన్న వ్యాపారాలు, ఎంఎస్ఎంఈ, స్థానిక రైతుల జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా ఇది దాదాపు 1,000 ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించ నుందని తెలిపారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 2024, ఏప్రియల్ 12 మరియు 13 తేదీలలో కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మరియు టెక్నెక్స్, ఐఐటి, వారణాసి వారి సంయుక్త ఆధ్వర్యంలో "అడ్వాన్స్ ఆటోమొబైల్ మెకానిక్స్ "అనే అంశంపై వర్కుషాప్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శశాంక్ పాట్లోళ్ల, కార్పొరేట్ ట్రైనర్, టెక్నిక్స్, ఐఐటి, వారణాసి వారు విచ్చేసారని, కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, ఇటువంటి సాంకేతిక కార్యక్రమాలను నిర్వహించడంలో తమ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని, వాటి ద్వారా విద్యార్థులు అనేక సాంకేతిక నైపుణ్యాలను, నూతన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన శశాంక్ పాట్లోళ్ల, మాట్లాడుతూ, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అడ్వాన్స్ ఆటోమొబైల్స్ టెక్నాలజీ నేర్చుకోవడం ద్వారా కలిగే నూతన అవకాశాలను మరియు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, వివిధ విభాగాధిపతులు, కార్యక్రమ కో ఆర్డినేటర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి విజయాలు సాధించినట్లు చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కిషోర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచి ఈ విజయాలు సాధించాను అన్నారు. ఈ పోటీలలో కె. హరిప్రియ గ్రాండ్ ప్రైజ్‌కు లాప్టాప్ ఫస్ట్ ప్రైజ్ ఐ సోనీ ట్యాబ్ గోల్డ్ మెడల్స్ 140 వారికి స్మార్ట్ వాచీలు కన్సోలేషన్ ప్రైజ్ 48 స్పెషల్ ప్రైజులు ఆరు మెరిట్ ప్రైస్ లు 4 0 0 సాధించినట్లు తెలిపారు. మొత్తం 6 05 ప్రైజులు సాధించినట్లు కిషోర్ తెలిపారు. బహుమతులు దేవరపల్లి సీఐ సురేష్ బాబు ఎస్సై కే శ్రీ హరిరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉదయభాస్కర్, ఏజీఎం పార్థసారథి పాల్గొన్నారు.

ఘనంగా అచ్చిబాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు ఆంధ్ర షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) పుట్టినరోజు వేడుకలు దొమ్మేరు అయన స్వగృహం లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వర రావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష,, పొట్రు శ్రీను, గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్ది పాటి వెంకట రాజు, గోపాలపురం జనసేన ఇంచార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు, పోలవరం మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస రావు ,కొవ్వూరు జనసేన ఇంచార్జి టీవీ రామ రావు, పట్టణ జనసేన అధ్యక్షులు దేగలరాము, గంగుమళ్ల స్వామి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కాకర్ల సత్య నారాయుడు, తెలుగుదేశం నాయకులు కలగర రంగా రావు, కొవ్వూరు నియోజక వర్గం నుంచి టీడీపీ -జనసేన -బీజేపీ పార్టీల నాయకులూ కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొని కేక్ కటింగ్ చేసి,పుష్ప గుచ్చాలతో, పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియ చేశారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో కళాశాలలు పోటాపోటీ

విశాలాంధ్ర - సీతానగరం: ఇంటర్మీడియట్ ఫలితాలలో కళాశాలలు పోటాపోటీ పడ్డాయి. మండల వ్యాప్తంగా ఒక ప్రభుత్వ, రెండు ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. దీనిలో సీతానగరం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం 87 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 65 మంది ఉత్తీర్ణులు అయ్యారు. దీనిలో 1000కి పి.ధర్మరాజు 939, సి ఎచ్ ప్రశాంతి 895 మార్కులతో కళాశాల మొదటి, రెండవ స్థానాలను సాధించారు. రఘుదేవపురం గ్రామంలోని సత్య ప్రభా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 50కి 32 మంది, రెండవ సవంత్సరం 48 కి 32 మంది విద్యార్దులు ఉత్తీర్ణులు అయ్యారు. వీరిలో కె వెంకన్న బాబు 972 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం సాధించాడు. చినకొండేపూడి గ్రామంలో గల సూర్య చంద్ర అకాడమి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 17 కి 17 మంది, రెండవ సంవత్సరం 24 కి 22 మంది విద్యార్దులు ఉత్తీర్ణులు అయ్యారు. వీటిలో మొదటి 470 మార్కులకు 442 సాధించగా రెండవ సంవత్సరం 899 మార్కులు సాధించారు.

ఎపిపిఎస్‌ఇ గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో 9 మంది ఉత్తీర్ణత

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కె.ఆర్.పురం ఆధ్వర్యంలో వై.టి.సిలో 25 రోజులు ఉచిత శిక్షణ పొందిన 70 మందిలో ఇటీవల ఎపిపిఎస్‌ఇ నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో 9 మంది ఉత్తీర్ణత పొందడం అభినందనీయమని కె.ఆర్.పురం ఐటిడిఎ పివో యం. సూర్యతేజ తెలియజేశారు. జనవరి 27, 2024 నుంచి ఫిబ్రవరి,24వ తేదీ వరకు 25 రోజులు వై.టి.సి నందు 70 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఇటీవల గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో 9 మంది ఉత్తీర్ణత పొందారని, ఇదే స్ఫూర్తితో గ్రూప్-2 మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలు పొందాలని పివో ఐటిడిఎ ఆకాంక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే శాంతిభద్రతలు

విశాలాంధ్ర-కొవ్వూరు : కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశంలోనూ రాష్ట్రంలోనూ శాంతిభద్రతలు నెలకొంటాయని రాజమండ్రి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన ప్రచారాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొవ్వూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరిగెల అరుణకుమారితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు అంతకుముందు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వేంచేసి ఉన్న వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరుణ్ కుమారి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి దక్కాల్సిన ప్రత్యేక హెూదా విశాఖ రైల్వే జోన్ పోలవరం ప్రాజెక్టు పూర్తి వంటి అంశాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గంధం బాబ్జి పిసిసి సభ్యులు గడ్డం సాయిబాబా జిల్లా ఉపాధ్యక్షులు కొణిదెల శ్రీనివాస్, ప్రభాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి సమాధి కట్టాలి

విశాలాంధ్ర - కరప : వైసీపీకి సమాధి కట్టాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు పేర్కొన్నారు. కరప మండలం వలసపాకుల గ్రామంలో ఎన్డీఏ కూటమికి ఓటు వేయాలని పంతం నానాజీ కుమారుడు సందీప్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వై పండు, భోగి రెడ్డి గంగాధర్ భోగి రెడ్డి కొండబాబు, కాకర్ల బుజ్జిబాబు, మహేంద్ర బాబు, సింహాద్రి, గుళ్ళపల్లి శ్రీనివాసరావు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో 54 శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం విడుదలైన ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉండ్రాజవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కె. ఎస్.కె. మాణిక్యాలరావు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ప్రారంభమైన కళాశాలలో మొత్తం 13 మంది విద్యార్థినిలు జూనియర్ ఇంటర్ పరీక్షలు వ్రాసినట్లు ఆయన తెలిపారు. వీరిలో ఏడుగురు ఉత్తీర్ణులై 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీ.ఈ.సీ. లో 10 మందికి గాను 6 మంది, ఎం.పీ.సీ. గ్రూపులో 3 మందికి గాను ఒకరు ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం చెప్పారు. సీ.ఈ.సీ గ్రూపులో గున్నేపల్లి తన్విక 500 మార్కులకు గాను 371 మార్కులు పొంది 74 శాతం తో ప్రథమ స్థానం సాధించగా, ఎం.పి.సి. నుండి ఎం.బి.డి. శిరీష 470 మార్కులకు గాను 405 మార్కులతో 86 శాతం సాధించి, ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

భేటీ బచావో భేటీ పడావోపై అవగాహన

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ఐ.సి.డి.ఎస్ సీడీపీఓ మమ్మీ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన తాళ్ళపూడిలో కిషోర్ బాలికలకు భేటీ బచావో భేటీ పడావోపై అవగాహన కార్యక్రమాన్ని తాళ్ళపూడి జెడ్పి.ఎచ్.స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.సి. డి.ఎస్ సూపర్ వైజర్ భాగ్యకుమారి మాట్లాడుతూ కౌమార దశలోకి వచ్చిన ఆడపిల్లలు ప్రవర్తన ఎలా ఉండాలి, వారు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లను వివరించారు. బాడ్ టచ్, గుడ్ టచ్ గురించి ఆడపిల్లలకు తెలియ పరిచారు. పి.ఎచ్.సి హెల్త్ ఎడ్యుకేటర్ భాగ్యలక్ష్మి స్కూల్ ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు సుజాత తదితరులు హాజరయ్యారు.

ఎకరాకు 50 బస్తాలు దిగుబడి పంట కోత ప్రయోగం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలం లోని వేగేశ్వరపురం గ్రామంలో రైతులు బుద్దాల సురేష్ మరియు వనమల వీరబాబు పొలాలలో రెండు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. కొవ్వూరు ఉపగణాంక అధికారి పి.సోమరాజు సూపర్వైజర్‌గా ప్రయోగాలను పరిశీలించారు. పి.ఆర్ 126 పంట దిగుబడి అత్యధికంగా 50 బస్తాలు పండిందని తెలియజేశారు. 340 1/3 లో వనమాల వీరబాబు పొలంలో ఎంటీయూ 1121 రకం కూడా బాగా పండిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి జోడాల వెంకట్ మాట్లాడుతూ సరైన సమయంలో మందులు వాడుతూ శ్రద్ధ తీసుకోవటం వలన బుద్ధాల సురేష్ 50 బస్తాలను పండించారని కొనియాడారు. వీరితో పాటు వ్యవసాయ సహాయకులు పోసమ్మ, ఇన్సూరెన్స్ ఏజెంట్ పోసిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'సాయిదీప్తి' విజయకేతనం

విశాలాంధ్ర - మామిడికుదురు : నగరంలోని "సాయిదీప్తి" ఐఐటీ, మెడికల్ అకాడమీకి చెందిన ఇంటర్ విద్యార్థులు శుక్రవారం విడుదలైన ఫలితాల్లో విజయఢంకా మోగించినట్లు దీప్తి విద్యా సంస్థల చైర్మన్ డివివి సత్య నారాయణ తెలిపారు. జూనియర్ ఇంటర్లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను నల్లా హారికచంద్ర 461 మార్కులు, సీనియర్ విభాగంలో 1000 మార్కులకు చిట్టినీడి మీనా 976 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. సీఈసీలో దొమ్మేటి భాగ్యశ్రీ 500 కుగాను 456, ఎంపీసీలో 470కి కడి నాగరమ్య 457, డి శ్రావణి 449 మార్కులు సాధించారన్నారు. ఈ మార్కులు కోసం కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ జక్కంపూడి శివ ప్రసాద్‌ను, అధ్యాపకులను, విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను చైర్మన్ డీవీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

జోగేశ్వరరావు గెలుపునకు కృషి చేయండి

చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర - అమలాపురం : మండపేట నియోజవర్గంలో టిడిపి అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావును మారుస్తున్నారన్న ప్రచారం పక్షం రోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో అమలాపురంలోని కిమ్స్‌లో టిడిపి అధినేత చంద్రబాబు వద్దకు జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలా కృష్ణ, మండపేట టిడిపి అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావులు శుక్రవారం వెళ్లి కలిశారు. శుక్రవారం విశాలాంధ్రలో వేగుళ్లను మారుస్తున్నారా శీర్షికన ప్రచురితమైన వార్త మండపేటలో ప్రకంపనలు సృష్టించింది. దీనితో వేగుళ్ల అమలాపురంలో ఉన్న చంద్రబాబు వద్దకు పరుగులు తీశారు. అక్కడ వారిద్దరితో చంద్రబాబు భేటీ అయ్యారు. అనంతరం మండపేట నుండి నాలుగోసారి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అసెంబ్లీకి పోటీ చేస్తున్నారని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై పూర్తి క్లారిటీని అటు పార్టీ వర్గాలకు ఇటు ప్రజలకు చంద్రబాబు ఇచ్చారు. దీంతో ఈనెల 20న వేగుళ్ళ జోగేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేయడానికి పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారని సమాచారం.